క్లుప్తంగా

ఇంటి వద్దే ఓటు వినియోగం



హోమ్ ఓటింగ్ విధానంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం మండలంలో 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికి పైబడిన దివ్యాంగులు తమ ఇంటి వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. అందులోభాగంగా హోమ్ ఓటింగ్‌కు మండలంలో 11 మంది దరఖాస్తు చేసుకుంటే, అందులో కొండామరి పల్లెకు చెందిన ఓటరు నమోదు చేసుకున్న తర్వాత చనిపోవడం జరిగిందన్నారు. దీంతో 10 ఓట్లకు సంబంధించి వృద్ధులు, దివ్యాంగులు శుక్రవారం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపారు. చిప్పిలిలో వృద్ధుడు అప్పలగారి వెంకటరమణ హోం ఓటింగ్ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో రూప్‌నాథ్, ఓపీఓ సురేంద్ర, మైక్రో అబ్జర్వర్ ఎస్.మల్లికార్జున, బీఎల్వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ కుక్కలపల్లి క్రాస్ రోడ్డులో ఎస్ఐ రవీంద్రబాబు శనివారం సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని కాట్నగల్లు పంచాయతీ దూలంవారిపల్లికి చెందిన క్రిష్టారెడ్డి (53) కర్ణాటక రాష్ట్రానికి చెందిన 70 మద్యం ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

వరాల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిసార్ అహ్మద్ పాల్గొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయం సాధించి సీఎంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాలని కోరుతూ పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయ ఉద్యోగులు జీవీ ప్రసాద్, ఆవుల రమణ, నారాయణరెడ్డి, హైదర్‌వల్లి, మదన్‌మోహన్‌రెడ్డి, రమణ,ఎస్ఎల్‌వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం జోరుగా ప్రచారం

రామసముద్రం: రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ గెలుపు కోసం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారాలు ముమ్మరం చేశారు. ఎంపీపీ కుసుమకుమారి, మాజీ కన్వీనర్ భాస్కర్‌గౌడు, ఎంపీటీసీ భర్త మస్తాన్, ఉప సర్పంచ్ మస్తాన్, భాస్కర్, శివ, కృష్ణప్ప, ఆర్.నడింపల్లి పంచాయతీలో జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్, ఎంపీటీసీ రెడ్డిశేఖర్ యాదవ్, సర్పంచ్ ఆదినారాయణ, పెద్దకురప్పల్లి పంచాయతీలో సర్పంచ్ రెడ్డెప్పనాయుడు, ఉప సర్పంచ్ దొరబాబు, విజయకుమార్, హరినాథ్‌నాయుడు, ఎలవానెల్లూరు, కురిజల పంచాయతీలో సర్పంచ్ ఉదయ్‌శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద, కత్తి వాలెప్ప, ఈశ్వర్, కేశవ, రెడ్డెప్ప, చొక్కాండ్లపల్లి పంచాయతీలో నాయకులు, కన్వీనర్ నంద, గెవన్న, బీసీ సెల్ బాలాజి, ఈశ్వర్‌రెడ్డి, పాలబత్తుల సుబ్రమణ్యం, మహబూబ్‌బాషా తదితరులు ప్రచారాలు ముమ్మరం చేశారు. ఇంటింటా వైఎస్సార్‌సీపీ మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

డీఎంఈకి అనుగుణంగా సౌకర్యాలు



వైద్యులతో చర్చిస్తున్న సూపరింటెండెంట్

మదనపల్లి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)నిబంధనలకు అనుగుణంగా జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్ ఎమ్మెస్ రాజు అన్నారు. శనివారం ఆసుపత్రిలోని సీనియర్ వైద్యులు మురళీధర్, శ్రీనివాసులు అనిత బందంతో కలిసి, ఆసుపత్రిలోని వార్డులు ఎక్సరే, ఈసీజీ, తదితర విభాగాలను పరిశీలించారు. యంత్ర పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. త్వరలో డీఎంఈ అధికారులు జిల్లా ఆసుపత్రికి తనిఖీ నిమిత్తం రానున్నారని, ఈ లోపుగా ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆస్పత్రి వైద్యులతో సమీక్ష నిర్వహించారు. సంబంధిత విభాగాధికారులతో చర్చించారు. ఆసుపత్రిలో యంత్ర పరికరాలు, సౌకర్యాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా వేస్ట్ మెటీరియల్ తొందరగా తరలించి శుభ్రపరచాలన్నారు. ఇటీవల పలుమార్లు ఆస్పత్రి వార్డులలోకి పాములు సరిపడడంపై పెస్ట్ కంట్రోల్ విభాగం వారిని పిలిచి విచారించారు.

ములకలచెరువు... అభివృద్ధిలో ముందడుగు





సోంపల్లె గ్రామ సచివాలయం (ఇన్‌సెట్) సోంపల్లెలో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

- ఆర్బీకే, సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు
- ఊరూరా తారు, సిమెంటు రోడ్లు
- శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ జీర్ణోద్ధారణ పనులకు రూ. 1.77 కోట్లు
- గండికోట రిజర్వాయర్ నుంచి తాగునీటి కోసం పైపులైను ఏర్పాటు
- చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ములకలచెరువు : గతంలో అనేక ప్రభుత్వాలు, పాలకులు మారినా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ములకలచెరువు మండలం అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తోంది. ఈ ఐదేళ్లలో మండలంలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

ఇంటి ముంగిటకే పాలన..

గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం నిజం చేస్తూ గ్రామ సచివాలయాల నిర్మాణంతో ప్రజల వద్దకే పాలన వచ్చింది. మండలం వ్యాప్తంగా రూ.4.80 కోట్లతో 12 సచివాలయాలు, రూ. 1.96 కోట్లతో 9 ఆర్బీకే కేంద్రాలు నిర్మించారు. ప్రజలకు సంబంధించి సర్టిఫికేట్లు కోసం, రైతులకు సౌకర్యం కల్పించేందుకు భవనాలు నిర్మించారు. సచివాలయ ఉద్యోగులతో సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

మెరుగైన వైద్య సేవల కోసం సామాజిక ఆరోగ్య కేంద్రాలు

గ్రామీణా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి మండల వ్యాప్తంగా రూ.2.34 కోట్లతో 9 సామాజిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించారు. వైద్య నిపుణులతో వైద్య సేవలు అందించడానికి తగిన చర్యలు సైతం తీసుకొన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట :

విద్య కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేసింది. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి తీసిపోకుండా అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించింది. విద్యార్థుల భవిత కోసం అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలు సైతం అందించింది. మండలం మొత్తం రూ.11.5 కోట్లతో 34 పాఠశాలను నాడు - నేడు కింద అభివృద్ధి చేశారు.

పురాత ఆలయం పునఃనిర్మాణానికి రూ.1.77 కోట్లు

ములకలచెరువు మండలంలోని పాతములకలచెరువులో వెలసిన పురాతన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని రూ.1.77 కోట్లతో పునఃనిర్మాణ పనులు చేపట్టారు. ఈ ఆలయం చాలా పురాతనం. శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నిర్మాణ పనులు జరుపుతున్నారు.

గండికోట రిజర్వాయర్ నుంచి తాగునీటి కోసం ప్రత్యేక పైపు లైన్లు

శాశ్వత తాగునీరు అందించడానికి గాలేరు నగరి జలాలను గండికోట రిజర్వాయర్ నుంచి ములకలచెరువు మీదుగా పీటీయం మండలంలోని హంద్రీ నివా కాలువలోకి అనుసంధానం చేయడానికి రూ.5500 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా ములకలచెరువు సరిహద్దు నుంచి మదనపల్లె వరకు రూ.342 కోట్లతో ఎంబీటీ రోడ్డును విస్తరించారు. పెద్దపాళ్యం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఫ్లై ఓవర్ పనులు చకచకా జరుగుతున్నాయి. పూర్తవగానే వాహనాలు రయ్ రయ్ అంటూ ఫ్లై ఓవర్ మీదుగా పరుగులు తీయనున్నాయి.

బీటీ, సిమెంట్ రోడ్ల సౌకర్యం

మండల వ్యాప్తంగా రూ. 3 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించారు. రూ.60.80 లక్షలతో సీసీ రోడ్లు గ్రామాల్లో వేయించారు. పల్లె పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కింది.



కాలువపల్లె ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు ద్వారా మారిన రూపురేకలు



ములకలచెరువులో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం



మద్దినాయునిపల్లి ఆర్బీకే కేంద్రం



బురకాయలకోట నుంచి బోయమాలపల్లెకు ఏర్పాటు చేసిన తారురోడ్డు

పల్లె ప్రగతిలో ఎంతో మార్పు తెచ్చాం



బి.కొత్తకోటలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఎన్నికల ప్రచారం



ములకలచెరువు : చౌడసముద్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి

బి.కొత్తకోట: గత ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాట మేరకు సమగ్రాభివృద్ధి చేశామని, ప్రజలు ఓటుతో ఆదరించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం బి.కొత్తకోట పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రజల వద్దకే వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ప్రభుత్వం ద్వారా పొందిన ఆర్థిక ప్రయోజనాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామని లబ్ధిదారులు చెప్పారు. గత ఏ ప్రభుత్వంలోనూ ఇంతటి సంక్షేమం పొందలేదని వివరించారు. ఈ సందర్భంగా ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డిలు నియోజకవర్గ అభివృద్ధికి మాటిచ్చారన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, మాజీ జెడ్పీటీసీ కంచి రెడ్డెప్పరెడ్డి, మాజీ ఉపసర్పంచు మాలిక్, షేక్ జాబీర్, బుద్దల వెంకటరెడ్డి, బలరాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అయూబ్, జాఫర్‌బాషా, శెట్టిపల్లె రమేష్‌రెడ్డి, రాయలసీమ రమేష్‌రెడ్డి, సల్మాన్, ఫయాజ్, సూరి, మంజు పాల్గొన్నారు.

చంద్రబాబుది మోసపూరిత మేనిఫెస్టో

ములకలచెరువు: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో మోసపూరితమని, ప్రజలు నమ్మే స్థితిలో లేరని తంబళ్లపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన చౌడసముద్రం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మోసపూరిత హామీలు ప్రకటించడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. మేనిఫెస్టోలోని హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, మండల కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచులు రాంబాబునాయుడు, విష్ణువర్ధన్, జయచంద్ర, మహబూబ్‌బాషా, ఎంపీటీసీ మహేశ్వరి, నాయకులు డాక్టర్ చంద్రారెడ్డి, రెడ్డెం క్రిష్టారెడ్డి, జయరామ్‌రెడ్డి, రెడ్డిబాషా, మహదేవరెడ్డి, మల్‌రెడ్డి, రెడ్డెం శివకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి



పెద్దమండ్యం: వడ్డివంకతండాలో కవితమ్మ ఇంటింటా ప్రచారం

పెద్దమండ్యం: ప్రతి పల్లెకు తారురోడ్డు, సిమెంటు రోడ్లు వేశాం.. ఎన్నో సంవత్సరాలుగా మీరు ఎదురుచూస్తున్న పెద్దేరు నదిపై బ్రిడ్జిని నిర్మించాం.. ఎప్పుడూ జరగని అభివృద్ధిని మీరు చూశారు.. జరగబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ ఓటర్లను కోరారు. రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలను గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని దిగువపల్లె పంచాయతీలోని బండేవాండ్లపల్లె, దిగువపల్లె, దేవళంవంకతండా, తుమ్మలవంకతండా, వడ్డివంకతండా, అవికేనాయక్‌తండా పంచాయతీలోని షేకేనాయక్‌తండా, చిగురుమానితండా, అవికేనాయక్‌తండా, దేనేనాయక్ తండా, మందలవారిపల్లె పంచాయతీలోని యర్రగుట్టపల్లె, దండువారిపల్లె, మందలవారిపల్లె, తండా, హరిజనవాడల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ, మాజీ జడ్పీటీసీ రమేష్, ఎంపీటీసీ సభ్యులు బుక్కే నాగేశ్వరి, ఆర్‌బీకే చైర్మన్ చాను, మండల కన్వీనర్ చాంద్‌బాషా, జెఎస్‌వి కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులునాయక్, రెడ్డెప్పరెడ్డి, భరత్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: జగనన్న సంక్షేమ పాలన మరోసారి కావాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు ఓటర్లను కోరారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులైన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలకు మద్దతుగా శనివారం మండలంలోని కమ్మచెరువు పంచాయతీలో పర్యటించారు.

కురబలకోట: మండలంలోని అంగళ్లు గ్రామంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు రెడ్డికుమారి ఆధ్వర్యంలో శనివారం వివిధ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌ను మరోసారి సీఎంను చేద్దామని చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని కోరారు. ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు ముద్ర దామోదర్ రెడ్డి, ఆదినారాయణ, పద్మ, మొలక గోపాల్‌రెడ్డి, సిద్దల కిరణ్‌కుమార్‌రెడ్డి, సుబహాన్, మూలింటి హరీష్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె టీడీపీ నాయకులవి పగటికలలు



మాట్లాడుతున్న మొరుసుకాపు ప్రతినిధులు

మదనపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మొరుసుకాపు ఓట్లన్నీ తమకేనని, టీడీపీ నాయకులు భ్రమపడుతూ పగటికలలు కంటున్నారు.. అన్ని కులాల వారు ఓట్లు వేస్తేనే ఎమ్మెల్యే అవుతారన్న విషయం వారు తెలుసుకోవాలని మొరుసుకాపు ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు వ్యాఖ్యానించారు. శనివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ...తంబళ్లపల్లె నియోజకవర్గంలో కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయాలనుకోవడం టీడీపీకి తగదన్నారు. సొంత గ్రామాన్నే అభివృద్ధి చేయని వ్యక్తి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటే ప్రజలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు ?. తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి నల్లారికిరణ్‌కుమార్‌రెడ్డి పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎస్.వి.రమణారెడ్డి, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, రవీంద్రారెడ్డి(పెదబాబు), జనార్ధన్‌రెడ్డి, శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాయునిచెరువుపల్లె సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా ప్రకటన బూటకపు హామీనే

- రాజంపేట పార్లమెంటరీని మూడు జిల్లాలు చేస్తామన్న బాబు
- ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలని తప్పుడు వాగ్దానాలు
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఎల్లోమీడియా దుష్ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి తదితరులు

మదనపల్లె : సినిమాల్లో నటులు డబుల్ యాక్షన్, ట్రిపుల్ యాక్షన్ చేసినట్లుగా...రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని, రాయచోటిని జిల్లాగా కొనసాగిస్తామని, రాజంపేట పేరుతో పార్లమెంటరీ స్థానం ఉంది, కనుకే జిల్లా చేస్తామని...ఒకో చోట ఒకో మాట మాట్లాడుతూ...ప్రజలను ఏమార్చేందుకు చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు చెబుతున్నట్లుగా రాజంపేట పార్లమెంటరీలో ఏది జిల్లా కేంద్రమో తేల్చిచెప్పాల్సిందిగా టీడీపీ నాయకులు, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను తాము ప్రశ్నిస్తున్నామన్నారు. 2014లో చంద్రబాబు 600 అబద్ధపు హామీల మాదిరిగానే.. జిల్లా కేంద్రం చేస్తామనేది బూటకపుహామీ అని ప్రజలు గ్రహించాలన్నారు. సూపర్ సిక్స్, సూపర్ టెన్ అంటూ చంద్రబాబు సాధ్యం కాని హామీలతో మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్నారని, వీటికి రూ.1,26,611 కోట్లు కావాల్సి ఉంటుందన్నారు. వీటిని అమలు చేయాలంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదన్నారు. ఎలాగూ అమలుచేసేది లేదు కనుకే నోటికి వచ్చినట్లుగా హామీలు ఇచ్చేసి అధికారంలోకి రావాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు 70 వేల కోట్లు ఖర్చవుతుంటే..పెంచాలంటే మరింత కావాలని, ఏం చేయగలమో, వాటినే ప్రజలకు చెప్పాలని సాధ్యం చేయగలిగిన మేనిఫెస్టోను వైఎస్సార్ సీపీ తీసుకువచ్చిందన్నారు. వంచనకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అయితే...నిజాయితీకి నిలువుటద్దం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చిన బీజేపీతో పొత్తు పెట్టుకుని ప్రజల ముందుకెళుతున్న చంద్రబాబు.. రాష్ట్రంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలులో లేనప్పటికీ, ఎల్లో మీడియా సహాయంతో ఏవేవో దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ తమ రెండు ఓట్లను వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుపై వేసి, ఎంపీ అభ్యర్థిగా పీవీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా నిసార్‌అహ్మద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, వెలుగుచంద్ర, సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారధి, సాయిప్రసాద్‌రెడ్డి, దుబ్బిగానిపల్లె సర్పంచ్ బుద్దయ్య, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసానికి ప్రతిరూపం చంద్రబాబు

మదనపల్లె : మోసానికి ప్రతిరూపం టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడని, సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఆశతో అలవిగాని హామీలు గుప్పిస్తూ, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని 1,2, 33 వార్డుల్లో నిసార్‌అహ్మద్ భార్య తస్లీమ్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకావెంకటాచలపతి, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఎం.వి.రమణ తదితరులతో కలిసి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. మే13న జరిగే ఎన్నికల్లో రెండుఓట్లను ఫ్యాన్‌గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు.

ఎన్నికలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు పట్టణంలోని బీటీ కళాశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అవలంబించాల్సిన విధివిధానాలు, పోస్టల్‌బ్యాలెట్ వినియోగ అంశాలపై ఆర్వో హరిప్రసాద్ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై పీఓ, ఏపీఓలు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఉల్లంఘనలు లేకుండా కచ్చితంగా మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ వినియోగంపైన సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నిర్లక్ష్యంతో ఏ చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తీవ్రమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.